

ఎవరికి 'మూడు'తుందో..?

- 3వ తేదీన మంత్రులు, ఎమ్మెల్యేలతో సిఎం జగన్ సమావేశం
- టిక్కెట్లపై స్పష్టత ఇస్తారని చర్చ
- మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చనే ఊహాగానాలు
- మంత్రి సీదిరిని తప్పిస్తారంటూ ప్రచారం


వైసిపి ఎమ్మెల్యేల్లో టెన్షన్ మొదలైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల మూడో తేదీన మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం కానుండడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. మంత్రివర్గంలో మార్పులు, వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లపై స్పష్టతనిస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యేలు, మంత్రులతో ఇప్పటికే పలుమార్లు సమావేశమైన సిఎం, వారి పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మారకుంటే వారిని మారుస్తామంటూ తేల్చిచెప్పారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం సిఎంతో అత్యవసర భేటీ విశేష ప్రాధాన్యం సంతరించకుంది. మరోవైపు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శాసనసభ సమావేశాల తర్వాతే అక్కడే ఉండిపోవడంతో ఏదో జరుగుతుందనే చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రితో ఈనెల మూడో తేదీన నిర్వహించనున్న సమావేశానికి ఇప్పటికే జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అమరావతికి చేరిపోయారు. శాసనసభాపతి తమ్మినేని సీతారాం శాసనసభ సమావేశాల తర్వాత అక్కడే ఉండిపోయినట్లు తెలిసింది. ఆమదాలవలసలో తమ్మినేనిని మారుస్తారంటూ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో పార్టీలో ముఖ్యనేతగా ఉన్న సువ్వారి గాంధీకి టిక్కెట్ ఇస్తారని అతని అనుచరులు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం సువ్వారి గాంధీ కూడా అమరావతిలోనే ఉన్నారని, సిఎంతో భేటికి ఆయన కూడా హాజరవుతారని తెలుస్తోంది. ఆమదాలవలస టిక్కెట్‌కు సంబంధించి సువ్వారి గాంధీకి మాట ఇచ్చామని, మీరు ఎంపీగా పోటీ చేయాలంటూ అధిష్టానం సూచించినట్లు తెలిసింది. అందుకు ఆయన అయిష్టత చూపుతూనే ఎమ్మెల్యే టిక్కెట్‌ను తన కుమారుడు చిరంజీవి నాగ్‌కు ఇవ్వాలని అభ్యర్థించినట్లు సమాచారం. ఇంట్లో ఇద్దరికి ఇవ్వడం కుదరదని అధిష్టానం తేల్చిచెప్పినట్లు సమాచారం.

మంత్రి సీదిరిని తప్పిస్తారా?

పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుపై ముఖ్యమంత్రి రెండు సమావేశాల నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన తీవ్రంగా వెనుకబడ్డారని గతేడాది నవంబరులో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన పేరునూ చెప్పారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గంలో 84,003 కుటుంబాలను సందర్శించాల్సి ఉండగా ఇప్పటివరకు 29,259 ఇళ్లను (34.83 శాతం) సందర్శించారు. ముఖ్యంగా పశు సంవర్ధకశాఖ డీడీ డాక్టర్ అచ్చెన్న హత్యోదంతం ప్రభుత్వానికి, పార్టీకి అప్రతిష్టను తెచ్చిపెట్టింది. ఘటనను సరిగా డీల్ చేయలేకపోవడంపై అధిష్టానం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు నియోజకవర్గంలో ఆయనపై వస్తున్న అవినీతి ఆరోపణలు, పార్టీ నాయకుల తిరుగుబాటు వంటి అంశాలు ఇప్పటికే అధిష్టానం దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీంతో ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగిస్తారని ప్రచారం సాగుతోంది. శుక్రవారం ఆయన సిఎంతో భేటీ తర్వాత విలేకరులతో మాట్లాడిన మాటలు మంత్రివర్గం నుంచి తప్పిస్తారనడానికి ఊతమిస్తున్నాయి. మంత్రి పదవి నుంచి తనను తొలగిస్తారనే సమాచారం లేదని చెప్తూనే మంత్రి పదవి ఉన్నా, లేకపోయినా బాధపడనని చెప్పడం ద్వారా ఏం జరగబోతుందనడానికి ఇదో సంకేతంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి పదవి కన్నా ప్రజా సేవే ముఖ్యమని, తన దృష్టిలో వైసిపి ఎమ్మెల్యేలందరూ మంత్రులేనని పేర్కొనడం ద్వారా మానసికంగా సిద్ధమవుతున్నట్లుగా పార్టీలో చర్చ సాగుతోంది.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపైనా అసంతృప్తే

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పనితీరుపై అధిష్టానం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఒంటెత్తు పోకడలు, కేడర్‌ను విస్మరించడం వంటి కారణాలతో పార్టీలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. ఇప్పటివరకు నమ్మిన బంటుల్లా ఉన్న ఎమ్మెల్యే బావమరిది పిన్నింటి సాయి, మేనల్లుడు నాని సైతం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గ్రూపులు నడపుతూ ఏకంగా ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీలో నెలకొన్న గ్రూపుల పోరు, ఎమ్మెల్యే వ్యవహారశైలిపై పార్టీ అధిష్టానం ఇప్పటికే ఆరా తీసినట్లు తెలిసింది. అటు గడపగడపకూ మన ప్రభుత్వంలోనూ ఆయన వెనుకబడ్డారు. నియోజకవర్గంలో 97,721 కుటుంబాలను సందర్శించాల్సి ఉండగా ఇప్పటివరకు 46,130 ఇళ్లను (47.20 శాతం) సందర్శించారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పనితీరుపైనా అధిష్టానం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 88,944 ఇళ్లను సందర్శించాల్సి ఉండగా 33,214 గడపలను (37.34 శాతం) సందర్శించారు. నియోజకవర్గంలో దాదాపు అన్ని మండలాల్లోనూ పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. నియోజకవర్గానికి చెందిన ఇద్దరు, ముగ్గురు ముఖ్య నాయకులు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల మూడో తేదీన సిఎం జగన్మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో టిక్కెట్ల అంశం, మంత్రివర్గ విస్తరణపై ఏం ప్రకటన ఉంటుందోనన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

మన్యం బంద్ విజయవంతం

ప్రజాశక్తి - మెళియాపుట్టి, కొత్తూరు



కొత్తూరులో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘ నాయకులు

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ ఎపి గిరిజన సంఘం, గిరిజన సంఘాల జెఎసి శుక్రవారం చేపట్టిన మన్యం బంద్ జిల్లాలో విజయవంతమైంది. ప్రభుత్వ నిర్ణయాన్ని మెళియాపుట్టి, కొత్తూరు, మందస మండలాల్లోని పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బంద్‌లో భాగంగా కొత్తూరులో గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో నిరసన తెలిపారు. మెళియాపుట్టిలో గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టారు. గిరిజనేతరులను గిరిజనుల జాబితాలో చేర్చొద్దని, గిరిజన ఎమ్మెల్యేలు తక్షణం రాజీనామాలు చేయాలని, సిఎం డౌన్ డౌన్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న మాట్లాడుతూ బోయ వాల్మీకులను గిరిజనుల్లో చేర్చితే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే గిరిజనులకు చెందిన అనేక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. గిరిజన జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయింపు గానీ, సంక్షేమ పథకాలు గానీ అమలు చేయడం లేదన్నారు. బోయ, వాల్మీకులను గిరిజనుల్లో చేర్చడం ద్వారా గిరిజనులు మరిన్ని హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం పెడుతుంటే గిరిజన ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దారుణమన్నారు. వారు తక్షణమే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు మాట్లాడుతూ గిరిజనుల ఓట్లతో గెలిచిన పాతపట్నం, పలాస ఎమ్మెల్యేలు తమ వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సవర చొక్కారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఆదివాసీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.



మెళియాపుట్టిలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

పరిశ్రమల స్థాపన వేగవంతం కావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

జిల్లాలో పరిశ్రమల స్థాపన వేగవంతం కావాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 104 ప్రతిపాదనలు రాగా అన్ని ప్రతిపాదనలకు పూర్తి అనుమతులను మంజూరు చేసినట్లు చెప్పారు. ఇవే కాకుండా జిల్లాలో మరిన్ని పరిశ్రమలు స్థాపించేలా సలహాలు, సూచనలు తెలియజేయాలని కమిటీ సభ్యులను కోరారు. 27 క్లైమాస్‌కు సంబంధించిన రూ.1,13,34,788 రాయితీలను అనుమతించారు. సులభతర వాణిజ్య ప్రతిపాదనలు పరిశ్రమల శాఖ అన్ని అనుబంధ శాఖలతో సమన్వయానికి కార్యాచరణను ప్రతిపాదించారు. సమావేశంలో పిసిబి ఎం.ఎం నాయక్, ఎల్‌డిఎం హరిప్రసాద్, డిఐఒ ఉమామహేశ్వరరావు, అగ్నిమాపకశాఖ అధికారి వీరభద్రరావు, డిపిఒ రవికుమార్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి మన్మథరావు, సేల్స్ ట్యాక్స్ అధికారి జి.రాణి మోహన్, పలు పరిశ్రమల అసోషియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మందసలో వీర గున్నమ్మ వర్ధంతి సభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వీరగున్నమ్మ 83వ వర్ధంతి సందర్భంగా మందసలో శనివారం బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మందస బస్టాండ్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించే బహిరంగ సభలో మాజీ ఎంపీ, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. సభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సంరక్షక కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్‌పి సురేష్‌బాబు

అనాథ, వృద్ధ, మహిళా సంరక్షక కేంద్రాల్లో నిఘా అమల్లో భాగంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి ఎ.సురేష్‌బాబు ఆధ్వర్యాన నగరంలోని పలు కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో అమలు చేస్తున్న మెనూ, వసతులు, విరాళాలపై నిర్వాహకులతో, కేంద్రాల్లో రక్షణ పొందుతున్న వారితోనూ మాట్లాడారు. సంరక్షక కేంద్రాల పనితీరుపై నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డిఎస్‌పి కిరణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ సింహాచలం, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు మోసం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్



శ్రీకాకుళం అర్బన్ : వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఏటా జాబ్ కేలండర్ ప్రకటన జాడే లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. 2.30 లక్షల ఉద్యోగాల హామీని ప్రభుత్వం ఎప్పుడు నెరవేరుస్తుందని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఫేక్ పెట్టుబడులతో విస్తృత ప్రచారం చేసిందని, బడ్జెట్‌లోనూ అదే విధానాన్ని అవలంబించి అంకెల గారడీతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని పేర్కొన్నారు. జగన్‌కు భయపడి పెట్టుబడిదారులు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం లేదని ఆరోపించారు. రోడ్లు, ఇతర మౌలిక వసతులను ప్రభుత్వం గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టులు నిధుల్లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని విమర్శించారు. వైసిపి మోసపూరిత ప్రకటనలను నమ్మి మరోసారి మోసపోవద్దని పేర్కొన్నారు.

వైసిపి ఓడిపోతే నష్టపోయేది మహిళలే

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్ : వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓడిపోతే ముందుగా నష్టపోయేది మహిళలేనని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని సింగుపురంలో భైరి, కరజాడ, కిష్టప్పేట, సింగుపురం, తండేంవలస, సానివాడకు చెందిన ఆసరా పథకం లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయకుంటే మీ చేయిని మీరే నరుకున్న వారవుతారని వ్యాఖ్యానించారు. వైసిపి అధికారంలో లేకపోతే మొదట బుల్లెట్ మహిళలకే తగులుతుందన్నది గుర్తుంచుకోవాలన్నారు. జగన్ సంక్షేమ పథకాలతో డబ్బులు వృథా చేస్తున్నారని చంద్రబాబు అంటున్నారని, మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వడం తప్పా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం చంద్రబాబుకు ఇష్టం లేదని, అందుకే జగన్‌పై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. పొరపాటున టిడిపి అధికారంలోకొస్తే ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలేవీ అందకుండా పోతాయన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబులా జగన్ మాయ మాటలు చెప్పలేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని తెలిపారు. మనకు మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, అంబటి శ్రీనివాసరావు, చిట్టి జనార్ధనరావు, గొండు కృష్ణమూర్తి, చల్లా రవికుమార్, పొన్నాన కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు బారిన పడొద్దు

శ్రీకాకుళం అర్బన్ : కటుంబాన్ని చిన్నాభిన్నం చేసే మత్తు బారిన పడొద్దని వికలాంగుల శాఖ ఎడి ఎం.కిరణ్‌కుమార్ యువతకు పిలుపునిచ్చారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై వికలాంగుల శాఖ ఆధ్వర్యాన నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు బారిన పడిన వారిని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా మత్తు వీడేందుకు తగిన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. యువత లక్ష్యాల వైపు అడుగులు వేస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఉద్యోగాలతో పాటు ఉన్నత స్థితి వస్తుందని తద్వారా కుటుంబ గౌరవం పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌పి కె.గోపాల్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందన్నారు. సైకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవ మాట్లాడుతూ ఉత్ప్రేరకాల వినియోగం వల్ల మానసిక రుగ్మతలు తలెత్తే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ పెండింగ్ పనులపై దృష్టి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో పెండింగ్ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్‌అండ్‌ఆర్, పెండింగ్ పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ కింద ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలపై ఎపిఇడబ్ల్యుఐడిసి, ఆర్‌డబ్ల్యుఎస్, నెడ్‌క్యాప్, టెక్కలి సబ్ కలెక్టర్, ఇపిడిసిఎల్ ద్వారా పనులు అప్పగించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో మాట్లాడి పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టిసారించి పనులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులపైనా దృష్టిసారించాలని సూచించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ జి.జయదేవి, పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, వంశధార ఎస్‌ఇ డోల తిరుమలరావు, ఇతర అధికారులు, ఆయా మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై కక్షసాధింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాజకీయ కక్షతోనే మోడీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై కుట్రలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి విమర్శించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీకి వచ్చిన స్పందన చూసి ఓర్వలేక అభద్రతాభావంతో ప్రధాని నరేంద్ర మోడీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. అదానీ కుంభకోణంపై నిలదీస్తున్న రాహుల్ గాంధీని పార్లమెంట్‌కు రానీయకుండా చేసేందుకు ఎంపీ సభ్యత్వాన్ని ఆగమేఘాల మీద రద్దు చేయించారని విమర్శించారు. గాంధీ కుటుంబం దేశానికి అందించిన సేవలను ప్రజలు విస్మరించరని, రానున్న రోజుల్లో బిజెపికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు దేశల్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణ, పైడి నాగభూషణరావు, బస్వా షణ్ముఖరావు, ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బాధితులకు నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఐసిడిఎస్ పీడీ కె.అనంతలక్ష్మిని ఆదేశించారు. వన్‌స్టాప్ సెంటర్, దిశ చట్టాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వన్‌స్టాప్ కేంద్రంపై అవగాహన కల్పించేలా హోర్డింగ్‌ల ఏర్పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సమావేశంలో దిశ డిఎస్‌పి పి.సోమశేఖరరావు, వన్‌స్టాప్ కేంద్రం ఎస్‌ఐ రేణుక, డిఆర్‌డిఎ ఎపిఎం ధనలక్ష్మి, మహిళా మార్గదర్శి డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గ్-పలాస-బరంపురం రైలు నడపాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

దుర్గ్-పలాస-బరంపురం మధ్య రైలు నడపాలని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్ నియోజకవర్గ ఎంపీ పి.విజయ్ బాగెల్‌తో కలిసి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కోరినట్లు ఆంధ్ర ఉత్కళ సంఘర్షణ సమితి అధ్యక్షుడు, రైల్వే బోర్డు సలహా కమిటీ సభ్యుడు కర్రి ఉమాశంకరరావు తెలిపారు. ఛత్తీస్‌గడ్ లో నివాసం ఉంటున్న ఆంధ్ర, ఉత్కళ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. దుర్గ్-పలాస-బరంపురం మధ్య రైలును నడపాలని కోరుతూ 2013 నుంచి పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఆంధ్రా నుంచి బరంపురం, దుర్గ్‌కు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. నేరుగా రైలు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై దుర్గ్ ఎంపీ పి.విజయ్ బాగెల్ పార్లమెంట్‌లోనూ పలు సందర్భాల్లో ప్రస్తావించారని గుర్తుచేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఆంధ్ర ఉత్కళ సంఘర్షణ సమితి సభ్యులు ఎస్.ఆదినారాయణ, లండ శ్రీనివాసరావు, రోషన్ కుమార్, సంజీవ్ తదితరులున్నారు.

ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు

- కళ్లకు కట్టిననట్లు ప్రదర్శించిన స్వాట్ కమాండోలు
- స్వాట్ శిక్షణ జిల్లా పోలీసు శాఖకే గర్వకారణం
- విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



స్వాట్ బృందంతో డిఐజి, ఎస్‌పి తదితరులు

అగ్ని కీలల మధ్య శత్రుమూకలపై వీరోచిత దాడి... హైజాక్‌కు గురైన బస్సును తమ నియంత్రణలోకి తీసుకోవడం... విఐపిని రక్షించడం... భవనాలపై తాళ్లతో పాకుతూ... గాల్లో తాళ్లపై వేళ్లాడుతూ ఇలా స్వాట్ కమాండోలు ప్రదర్శించిన విన్యాసాలు చూపరుల ఒళ్లు గగుర్పొడిచాయి. అక్కడికి వచ్చిన వారిని కళ్లు పక్కకు తిప్పకుండా చేశాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన స్వాట్ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ శుక్రవారం నిర్వహించింది. రెండు నెలల పాటు కఠోర శిక్షణ పొందిన సుశిక్షితులైన స్వాట్ కమాండోలు ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ఉగ్రమూకలపై ఏవిధంగా ప్రతిదాడి చేస్తారో అని ప్రత్యక్షంగా ప్రదర్శించిన టార్గెట్ బిల్డింగ్, హౌస్ ఇంటర్వెన్షన్, వాల్ డ్రాప్, స్పైడర్ టెక్నిక్, బస్ ఇంటర్వెన్షన్, విఐపిల రక్షణ, కాంబోటివిస్ టెకినిక్స్ వంటి శిక్షణను విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, ఎస్‌పి జి.ఆర్ రాధిక తిలకించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నుంచి స్వాట్ శిక్షణ పొందడం పోలీసు శాఖకే గర్వకారణమని ప్రశంసించారు. విపత్కర పరిస్థితుల్లో వెపన్స్ అండ్ టాక్టిస్ శిక్షణ పొందిన పోలీసుల సేవలు అవసరమని ఎస్‌పి రాధిక భావించి ఆక్టోపస్ కమాండోలతో జిల్లా పోలీస్ సిబ్బందికి స్వాట్ శిక్షణను ఇప్పించారని తెలిపారు. మొట్టమొదటి సారిగా అర్బన్ వెల్ఫేర్ ఫర్ స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిస్ శిక్షణలో 30 మందికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. విపత్కర సమయంలో ఉగ్రమూకలపై ప్రతి దాడి అంశంపై ఇప్పుడు జిల్లా పోలీస్ శాఖ సిబ్బంది సుశిక్షతులు కావడం చాలా సంతోషకరమన్నారు.

ఎస్‌పి రాధిక మాట్లాడుతూ ఈరోజు స్వాట్ సిబ్బంది ప్రదర్శించిన ప్రత్యక్ష కార్యక్రమం వెనుక 60 రోజుల కృషి ఉందని తెలిపారు డిజిపి కె.రాజేంద్రనాథ్ రెడ్డి, డిఐజి ఎస్.హరికృష్ణ ఉత్తర్వులతో ఈ శిక్షణ కోసం ఆక్టోపస్ యూనిట్ నుండి 12 మంది శిక్షకులను తెప్పించి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది 32 మందికి రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో భవిష్యత్‌లో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీసు శాఖ సిద్ధంగా ఉంటుందన్నారు.

నగదు పురస్కారాలు జ్ఞాపికలు అందజేత

శిక్షణ ఇచ్చిన 12 మంది ఆక్టోపస్ అధికారులకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. శిక్షణ పొందిన 31 మంది స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి శిక్షణలో ప్రతిభ కనబరిచినందుకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు డిఐజి ఎస్.హరికృష్ణ చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు ఎస్‌పి కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, ఆక్టోపస్ ఎఎస్‌పి కె.రామచంద్రమూర్తి, డిఎస్‌పిలు ఎం.మహేంద్ర, ప్రసాదరావు, డి.ప్రసాద్, జి.శ్రీనివాసరావు, ఆర్ఐలు ఉమామహేష్, ప్రదీప్, సిఐలు శ్రీనివాసరావు, ఎస్.వి రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA
I.A.107/2016 in O.S.23/2009

Between: **B. Damayanthi** -Petitioner
And: **Erothu Veeresu & others** -Respondents

NOTICE

R-3: Thoomu Yashodamma, w/o late Rama Rao,Aged 35 years, Cooli,residing at Baruva vill, & P.O., Sompeta Mandal, Srikakulam District.

Please take notice that the petitioner filed the above petition against you for passing of Final Decree and it is posted to **03-04-2023 at about 10- 30 A.M.** in the above court, appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per law.

//BY ORDER//

K.S.P. BABU,
Advocate,
SOMPETA

IN THE HON'BLE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE,
O.S.6/2022.

Between: M/s. Laxmi Cloth Emporium, Sompeta, Represented by its Proprietor Sri V.M. Gandhi. -Plaintiff
And:
Ramakrishna Lankalapalli, Proprietor: New Jeans Corner, Door No.2/3, S.R.C. Centre, Palakonda Road, Rajam P.O., Rajam Mandal, Srikakulam District. -Defendant

NOTICE

To, Defendant: Ramakrishna Lankalapalli, Proprietor: New Jeans Corner, Door No.2/3, S.R.C. Centre, Palakonda Road, Rajam P.O., Rajam Mandal, Srikakulam District.

Please take notice that the plaintiff herein, filed the above suit for against you for recovery of Rs.22,590/- (Rupees twenty two thousand five hundred and ninety) towards principal and interest due under the cheque dated **15-07-2021** issued by you with subsequent interest and costs and it stands posted to **06-04-2023 at about 10-30 A.M.** in the above court for your appearance. You appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per Law.

//BY ORDER//

K.S. PRASAD BABU, ADVOCATE,
Main Road,
SOMPETA-532 284,
Srikakulam Dist.

హుండీ ఆదాయం రూ.93 వేలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లోని అరసవిల్లి సూర్యనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ.93,916లు వచ్చినట్లు ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ శుక్రవారం తెలిపారు. నోట్లు రూపేనా రూ.19,635, చిల్లర రూపేనా రూ.74,281లు వచ్చాయని చెప్పారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ సూపరింటెండెంట్ బి.వి.వి.ఆర్. ప్రసాద్ పట్నాయక్ ఆలయ అర్చకులు ఇప్పిలి సందీప్‌శర్మ రైల్వే స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి పర్యవేక్షణలో హుండీని సిబ్బంది లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బిఎస్ చక్రవర్తి, దేవదాయ ధర్మదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జివి.బిఎస్. రవికుమార్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఇఒ

వ్యాయామంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నిరంతరం వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని టిడిపి నాయకులు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. గార మండలం కె.మత్స్యలేశంలో వారధి రవి స్మారక వ్యాయామశాలకు సొంత నిధులతో సామగ్రిని శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల చిన్నవయసు లోనే అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారని, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా, ఫిట్ నెస్ వస్తుందన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బడగల వెంకట అప్పారావు, సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ కొంక్యాన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సామగ్రిని అందజేస్తున్న గొండు శంకర్

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

టెక్కలి రూరల్: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సుమన్ పండిపాటికి ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో పిహెచ్‌డిని ప్రదానం చేసిందని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. 'ఫ్రూగల్ అప్రోచ్ ఆఫ్ ఫ్రిక్షన్ స్టిర్, ప్రాసెసింగ్ ఫర్ జోయినింగ్ ఆఫ్ అల్యూమినియమ్ అండ్ అల్యూమినియమ్ అల్లాయిస్ అండ్ మల్టీ రెస్పాన్స్ ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రోసెస్ పారామీటర్స్ యూజింగ్' అనే అంశంపై ఐతమ్ మెకానికల్ హెచ్‌ఐడి ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీరాములు, కుతమ్, డీన్ ఆరెన్డీ డాక్టర్ పి.ఎస్.రావుల మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ వచ్చింది. ఐతమ్ అధ్యాపకునికి డాక్టరేట్ రావడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆరెన్డీ డాక్టర్ కె.బి.మధుసాహు, డీన్ డాక్టర్ డి.ఆజాద్, హెచ్‌ఐడి, గైడ్ డాక్టర్ డి.శ్రీరాములు, అధ్యాపక, అధ్యాపేకతర సబ్బంది అభినందించారు.

గృహ సారథులే రథ సారథులు

నరసన్నపేట: గృహ సారథులే రథసారథులని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైసిపి కార్యాలయంలోనాలుగు మండలాల కన్వీనర్లు, గృహ సారథులతో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రజలు అందుకున్న అన్ని సంక్షేమ పథకాలు గురించి ప్రచారం చేయాలని అన్నారు. 1 నుంచి 5వ తేదీలోపు 50 ఇళ్లకు వెళ్లి పరిచయం చేసుకోవాలని,7వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వేలంపాటలో రూ.9.01 లక్షల ఆదాయం

పొందూరు: మేజరు పంచాయతీలో వివిధ కేటగిరీలకు శుక్రవారం నిర్వహించిన వేలంపాటలో రూ9.10 లక్షల ఆదాయం సమకూరింది. పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో రోజువారి మార్కెట్‌ను అనకాపల్లి దేవి రూ.8.30 లక్షలు, ఆటోస్టాండ్‌ను అనకాపల్లి నాగరాజు రూ.25 వేలకు, కమేళాలను మద్దిల రాధాకృష్ణ రూ.50 వేలకు దక్కించుకున్నారు. వాస్తవానికి వేలంపాట ఈ నెల 29న జరిగినప్పటికీ అధికారులు నిర్ణయించిన ధరావత్తు కన్నా తక్కువకు టెండర్లు వేయడంతో పంచాయతీ అధికారులు శుక్రవారానికి వాయిదా వేశారు. అయితే గతంలో వచ్చే ఆదాయంతో పోల్చుకుంటే చాలా తక్కువ వచ్చిందనే ఆరోపణలు ఉన్నాయి.

భూ రీ సర్వేపై అవగాహన

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురం గ్రామ పంచాయతీలో భూముల రీ సర్వేపై రెండు బృందాలతో సమగ్ర సర్వే జరుగుతోందని తహశీల్దార్ గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల ఒకటి నుండి రెండు టీమ్‌లుగా గ్రామ సర్వేయర్‌లు, విఆర్ఒ, విఆర్ఎలు సర్వే ప్రారంభిస్తారన్నారు. రైతులు అందుబాటులో ఉండి, సహకరించాలని కోరారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ నర్తు వరప్రసాద్ ఉప తహశీల్దార్, మండల సర్వేయర్ తవిటినాయడు. రెవెన్యూ అధికారి శ్రావణ కుమార్, ఎంపిటిసి, రైతులు పాల్గొన్నారు.

మంత్రి ప్రతిష్టను దిగజార్చలేరు

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలో భూకబ్జాలపై టిడిపి నిరాధార ఆరోపణలు చేస్తోందని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై తప్పుడు ఆరోపణలతో ఆయన ప్రతిష్ట దిగజార్చలేరని వైసిపి మండల నాయకులు అన్నారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో పాలిన శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, గురయ్యానాయుడు విలేకరులతో మాట్లాడారు. భూ కబ్జాలపై పలాస మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక స్పందనను మంత్రి అప్పలరాజు నిర్వహిస్తే టిడిపి నాయకులు మూకుమ్మడిగా వచ్చి నిరాధార అర్జీలు ఇచ్చారన్నారు. రూ.1500 కోట్ల అవినీతి జరిగి ఉంటే ప్రత్యేక స్పందనలో ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. గౌతు కుటుంబం 60ఏళ్ల పాలనలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలన్నారు. వారితో పాటు వంక రాజు, ఎం.హరినారాయణ, డి.బాలరాజు, జోగ అప్పారావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే డ్వాక్రా సంఘాలకు తోడ్పాటు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఉద్యమంలా స్వయంశక్తి సంఘాలను ఏర్పాటు చేయించి, వారిని పొదుపు దిశగా నడిపించింది టిడిపి హయాంలోనని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు అన్నారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యాంకు ఖాతాలను అందుబాటులోకి తెచ్చి బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి టిడిపి ప్రభుత్వం తోడ్పాటు అందించిందని చెప్పారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బ్యాంక్ లింకేజీ, ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటు అందించి ప్రభుత్వపరంగా వారికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు డిఆర్‌డిఎతో అనుసంధానం చేసిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని నీరుగార్చిందని, డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేస్తూ సంక్షేమ పథకాల పేరుతో ఆర్థిక ప్రయోజనాలను కొందరికి మాత్రమే పరిమితం చేసిందని విమర్శించారు. నవరత్నాల పేరుతో డబ్బులు ఇచ్చి నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పన్నుల రూపంలో తిరిగి లాక్కుంటున్నారని, ఈ వాస్తవాన్ని మహిళలు గుర్తిస్తున్నారన్నారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, ఐటిడిపి జిల్లా అధ్యక్షులు ప్రదాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ ధర్నా

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి వర్గీకరణ కోరుతూ చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం స్పందించి రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాణా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్‌సి రిజర్వేషన్ కొందరికే పరిమితమవుతోందన్నారు. చట్టబద్ధమైన వర్గీకరణ చేపట్టి ఉప కులాలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాసరి తిరుమలరావు, రఘు, గోవిందరావు మాదిగ , తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

కలలన్నీ కల్లలైపోయాయి

- చేతికి అందొచ్చిన కొడుకు గ్రావెల్ క్వారీ వద్ద మృతి
- న్యాయం చేయాలని కుటుంబసభ్యుల ఆందోళన

ప్రజాశక్తి - పొందూరు

రెండేళ్ల కొడుకు, కడుపులో బిడ్డ ఉన్నప్పుడే భర్త అర్థాంతరంగా వదిలి వెళ్లిపోయాడు. అయినా మనోనిబ్బరం కోల్పోకుండా కూలి పనులు చేసుకుంటూ పిల్లలిద్దరిని పెద్ద చేసి, ఉన్నతంగా చదివిస్తూ.. ప్రయోజకులను చేయాలనుకుంది. కుమారుడు ఉన్నతంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలుస్తాడని ఆశపడ్డారు. ఇంతలో క్వారీ లారీ రూపంలో కుమారుడుని బలితీసుకోవడంతో చేతికి అందుకొచ్చిన కొడుకు అచేతనంగా పడి ఉండటాన్ని చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరై విలపించారు. మండలంలోని వి.ఆర్.గూడెం సమీపంలోని గ్రావెల్ క్వారీలో జరిగిన ప్రమాదంలో సంతకవిటి మండలం జి.ఎన్.పురంకు చెందిన బగాది మణికంఠ(20) అనే విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మణికంఠ వావిలపల్లిపేటలోని తాత, అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ శ్రీకాకుళంలోని ప్రవేటు కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులు క్రితమే డిగ్రీ పరీక్షలు అయిపోయాయి. ఖాళీగా ఉండలేక చేతి ఖర్చులకైనా డబ్బులు వస్తాయని భావించి అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ క్వారీలో పనికి వెళ్లాడు. గురువారం రాత్రి భోజనం చేసి లారీ లోడ్లు లెక్కించే పనికి వెళ్లాడు. పనిలో ఉండగా క్వారీ లారీ మణికంఠ తలపై నుంచి వెళ్లిపోవడంతో తల చిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు.


మణికంఠ మృతదేహం

'కొండపై అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ క్వారీలోనే ప్రమాదం జరిగి మణికంఠ మృతి చెందాడు. ఈ విషయం బయటకు తెలిస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని భావించి అక్కడి నుండి సుమారు అర కిలోమీటరు కిందకి మృతదేహాన్ని తీసుకొచ్చి లారీ కిందన పడుకోబెట్టి రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లుగా చిత్రీకరించారు' అంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. క్వారీలో అర్ధరాత్రి చనిపోతే వేకువజామున 5.30 గంటల సమయంలో మాకు సమాచారం ఇచ్చారని అన్నారు. ఘటనా స్థలంలో రక్తం మరకలు కనిపించకుండా మట్టివేసి కప్పివేశారని తెలిపారు. కొండపై అక్రమ క్వారీలో మృతదేహం ఉంటే తమ అక్రమ క్వారీ గుట్టు రట్టు అయితే మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్యలు తప్పవని గ్రహించి ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు ఈ విధంగా చిత్రీకరించారంటూ ఆరోపిస్తున్నారు.


మణికంఠ (ఫైల్)


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు

రహదారిపై బైఠాయింపు

మణికంఠ మృతికి న్యాయం చేయాలని మృతుని తల్లి వెంకటలక్ష్మి, చెల్లి శారదకు అండగా జి.ఎన్.పురం సర్పంచ్, గ్రామస్తులు చిలకపాలెం-పొందూరు రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. వాహనాలు రాకపోలకు జరగకుండా ఆటోలను అడ్డంగా పెట్టి రోడ్డుపై పడుకుని ధర్నా చేశారు. దీంతో సుమారు గంటపాటు నిరసన తెలపడంతో సుమారు రెండు కిలోమీటర్లు మేర ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఆమదాలవలస సిఐ పైడయ్య, ఎస్ఐ లక్ష్మణరావు వచ్చి మీరు కోరిన మేరకే న్యాయం చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారంతా నిరసనను విరమించారు. పోలీసులకు మృతుని తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. అక్రమ మైనింగి జరుగుతున్నట్లు గుర్తించామని, మృతదేహాన్ని ఘటనా స్థలం నుంచి మార్చారని, దీనికి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

ఆమదాలవలస, రణస్థలంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - ఆమదాలవలస, రణస్థలం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.నాగమణి పిలుపునిచ్చారు. ముందుగా ఆమదాలవలసలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన బైక్ ర్యాలీని నాగమణి ప్రారంభించారు. ఈ ర్యాలీ కాలేజీ రోడ్డు వరకు, అక్కడ నుండి వన్ వే సెంటర్ గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. రణస్థలంలో సిహెచ్ అమ్మన్నాయుడు బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ బంటుపల్లి కూడలి నుంచి రణస్థలంలోని రామతీర్థం కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు


రణస్థలం : బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న అమ్మన్నాయుడు


ఆమదాలవలస : జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నాగమణి

ఇవ్వాలని, కనీస పెన్సన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, స్కీం వర్కర్లు, డైలీవేజ్ కంటింజెంట్ ఉద్యోగులు, కార్మికుల రెగ్యులరైజేషన్, సిపిఎస్ రద్దు, ఒపెస్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, కేరళ తరహా రైతు రుణమాఫీ చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీకి రూ.3లక్షల కోట్లు కేటాయించి 14 రకాల సరుకులు సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, మోనిటైజేషన్ పైప్‌లైన్ రద్దు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, పి.లతాదేవి, భూలక్ష్మి, భారతి, అరుణ, సంతోష్, రమణ, జోగారావు, నరసింహులు, ఐ.నారాయణరావు, జె.గంగరాజు, పి.సత్యన్నారాయణ, కె.రమణ, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళిక ఆమోదం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

2023-24 వార్షిక ప్రణాళికకు సభ్యులు ఆమోదం తెలిపినట్లు పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు అన్నారు. శుక్రవారం సంతబొమ్మాళి సొసైటీ సర్వజన సమావేశం పిఎసిఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చులు, లోన్స్ రెన్యువల్స్‌పై చర్చించారు. 2023-24కు సంబందించిన ఎరువుల పంపిణీ, ఫ్రెష్ ఫైనాన్స్, స్వయం సహాయక రుణములు, బంగారు ఆభరణముల తనకాపై రుణములు, ఇతర అంశాలపై చర్చించి, ఆమోదించారు. సమావేశంలో పిఎసిఎస్ కమిటీ సభ్యులు పిలక రవికుమార్‌రెడ్డి, మార్పు నాగభూషణరావు, సొసైటీ సిఇఒ మాధురి, సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగన్నాయకులు

ఆయుర్వేద ఔషధం పంపిణీ

ప్రజాశక్తి - నౌపడ

వికాస తరంగిణి ద్వారా దీర్ఘాయువు ఆయుర్వేద కేంద్ర ఆధ్వర్యంలో నౌపడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వర్ణామృత ప్రాశన చుక్కలను శుక్రవారం వేశారు. స్థానిక సర్పంచ్ పిలక బృందాదేవి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 16ఏళ్లలోపు పిల్లలకు ఈ ఆయుర్వేద ఔషధం వేయడం వల్ల జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు పి.రవికుమార్‌రెడ్డి, వి.వాసుదేవరావు, బి.సోమశ్వరరావు, ఎన్.తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం అప్పలరాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

పురపాలక చెరువుల లీజుపై రగడ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో ఐదు చేపల చెరువుల లీజుపై రగడ జరిగింది. టిడిపి, వైసిపి కౌన్సిల్‌సభ్యుల మధ్య మాటామాటా పెరిగి, వాగ్వివాదం చోటు చేసుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. గత సమావేశాలు నుండి వాయిదా పడుతూ వస్తున్న చేపల చెరువులు లీజు విషయంపై మళ్లీ ఎజెండాలో రావడంతో చర్చ జరిగింది. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి మాట్లాడుతూ లీజు విషయంపై అధికారులు ప్రతిపాదించిన రూ.99వేలు లీజుకు ఇవ్వడం వల్ల మున్సిపాలిటీకి ఆదాయం పెద్దగా రావడం లేదని, అందుకే కొత్త నిబంధనలు మేరకు బహిరంగ వేలం నిర్వహిస్తే మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని సూచించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అందరికీ న్యాయం జరిగేలా చూడాలని బహిరంగ వేలం పాట నిర్వహిస్తే మున్సిపాలిటీ ఆదాయం పెరుగుతుంది కాబట్టి ఈ అంశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. టిడిపి సభ్యులు మాత్రం ఈ అంశంపై చర్చ జరగాలని ఇప్పటికే చాలా మంది మత్స్యకారుల ఉపాధికి గండి పడిందని సభ్యులు గేదెల శేఖర్, ఆసి లీలారాణి, నారాయణ బెహరా అభ్యంతరం వ్యక్తం చేశారు. అనవసరంగా వాయిదా వేయొద్దని అధికారులని నిలదీశారు. ఈ అంశంపై వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఇటీవల జరిగిన వివిధ వేలం పాటలో అత్యధికం పాడిన ఆశీలు పాటలను కౌన్సెల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి


అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టిడిపి కౌన్సిల్ సభ్యులు

అమ్మవారి సంబరాలకు ప్రత్యేక కేటాయింపు

స్వేచ్ఛావతి సంబరాలు సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ కొన్ని పనులకు విజ్ఞప్తి చేయడంతో కౌన్సెల్ సమావేశంలో ఎజెండాలో అంశాలపై సభ్యులు ఆమోద ముద్ర వేశారు. ప్రధానంగా రూ.15.30లక్షల విలువైన అభివృద్ధి పనులకు కౌన్సెల్ ఆమోదించింది. జంగిల్ క్లియరెన్స్, చెరువుల వద్ద ఎత్తులు, ముళ్ల పొదలు తొలగించేందుకు రూ.2.50 లక్షలు కేటాయించారు. జంగిల్ క్లియరెన్స్ విషయంలో సభ్యులు బచ్చు జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో చిన్న జెసిబి ఉంటుండగా పెద్దది అద్దెకి తెచ్చుకొని వాడడం అవసరమా? అని అన్నారు. చెరువుల వద్ద చిన్న జెసిబితో పని చేయడం కుదరదని మున్సిపల్ కమిషనరు రమేష్ తెలిపారు. పట్టణంలో జెసిబిలు రూ.వెయ్యి, రూ.1200కు అద్దెకు దొరుకుతున్నాయని, అధికారులు మాత్రం రూ.2వేలు ప్రతిపాదించడం బాగోలేదని అన్నారు. ఎస్ఎస్ఆర్ రేట్ ప్రకారం ప్రతిపాదన చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రతిపాదన ఎక్కువ ధర ఉండటం వల్ల వ్యత్యాసం ఉందని వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య అన్నారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, ప్రత్తి విజయకుమార్, మున్సిపల్ అధికారులు, కౌన్సెల్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాను ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి మండలం వలియాసాగరం సమీపంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బరంపురానికి చెందిన వారణాసి జనార్ధనరావు(70) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనార్ధనరావు విశ్రాంత లెక్చరర్. శుక్రవారం ఉదయం తన భార్య ఉషారాణి, బంధువులతో కలిసి విశాఖపట్నం వెళ్లేందుకు పలాస వరకు రైలులో వచ్చారు. అక్కడి నుంచి కారులో విశాఖ బయలుదేరారు. వలియాసాగరం వద్ద కారును ఆపిన జనార్ధనరావు మరలా కారు ఎక్కుతున్న సమయంలో శ్రీకాకుళం వైపు వస్తున్న వ్యాను ఆయనతోపాటు, కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన జనార్ధనరావును 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మార్గం మధ్యలో పరిస్థితి విషమించి కోటబొమ్మాళి వద్ద మృతి చెందారు. టెక్కలి పోలీసులు వాహనాన్ని, డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.రమేష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


జనార్ధనరావు (ఫైల్)

వాలంటీరు ఆత్మహత్య

మెళియాపుట్టి: పేలు మందు తాగి వాలంటీరు సవర కేసమ్మ(29) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మారడుకోట పంచాయతీ చీడిపాలెం సచివాలయంలో పని చేస్తున్న కేసమ్మకు పదేళ్ల క్రితం బంధువైన సవర భాస్కరరావుతో వివాహమైంది. వీరికి కుమార్తె ఆస్మిత, కుమారుడు చక్రవర్ధన్ ఉన్నారు. ఏడాదిగా భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. దీంతో కుమార్తెతో కలిసి కేసమ్మ మెళియాపుట్టిలోని పొందర వీధిలో తన తల్లి వరలక్ష్మి వద్ద ఉంటోంది. శుక్రవారం ఏం జరిగిందో తెలియదు. పేలు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తుచేస్తున్నారు.


కేసమ్మ (ఫైల్)

నేడు మండల సర్వసభ్య సమావేశం

పొందూరు: మండల ప్రజా పరషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కిల్లి ఉషారాణి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిదులు హాజరుకావాలని కోరారు.

జీవన ప్రమాణాల మెరుగుకు పథకాలు

కోటబొమ్మాళి: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కొత్తపేట సచివాలయం పరిధి అక్కయ్యవలసలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి దువ్వాడ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, బి.నాగేశ్వరరావు, డి.రోజా, రామకృష్ణ, నూక సత్యరాజు, జనార్ధనరావు, కవిటి రామరాజు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న దువ్వాడ శ్రీనివాస్

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి - కవిటి

విద్యార్థులు ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై దృష్టి తగ్గించి, సమాజంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ ఎదుగుదలకు పదో తరగతి పరీక్షలే మొదటి మెట్టని, ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష కిట్లఉన అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ, ఎంపిటిసి దుద్ధి సతీష్, మాజీ ఎంపిటిసి బెందాళం విజయ్, దీనబంధు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అట్టలను అందిస్తున్న సర్పంచ్


స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న శేషగిరిరావు

స్టడీ మెటీరియల్ అందజేత

ఇచ్ఛాపురం: మండలంలోని కొలిగాం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఒడియా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. పాఠశాల ఈచ్ఎం కె.శేషగిరిరావు అధ్యక్షతన హిందీ ఉపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ సొంతంగా తయారు చేసిన తెలుగు స్టడీ మెటీరియల్‌ను 40 మంది విద్యార్థులకు అందించారు. బిర్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 మంది విద్యార్థులకు అక్కడి ఈచ్ఎం వసంతి పట్నాయక్, జెడ్‌పి కొలిగాంలో ఒరియా ఉపాధ్యాయులు అమిత్ బెహరా 86 మంది విద్యార్థులకు, పరీక్ష కిట్లను అందించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం రాణి బెహరా, తిరుపతిరావు, మిను చంద్ర, మీనాకుమారి, ప్రశాంత్, లక్ష్మీ కాంత బెహరా, జనార్ధన, తిరుమలరావు, రామినాయుడు, పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.50 వేల ప్రోత్సాహకం

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని తాడివలస జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని గురుగుబెల్లి ఢిల్లీశ్వరి 2020 జనవరిలో చేసిన స్వామివివేకానంద స్ఫూర్తిదాయక ప్రసంగానికి మరోసారి గుర్తింపు లభించింది. శనివారం హైదరాబాద్‌లో పుల్లారెడ్డి, నరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం పుల్లారెడ్డి కాలేజీ చైర్మెన్ సత్తిరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు సూర్యప్రకాశ్‌రెడ్డి ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థినికి రూ.50వేలు నగదు ప్రోత్సాహకంతో ఘనంగా సత్కరించారు. శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన సైన్స్ ఉపాధ్యాయుడు రావాడ పాపారావుకు రూ.5వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. విద్యార్థినిని హెచ్‌ఎం లఖినాన హేమనాచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.


నగదు ప్రోత్సాహకం అందిస్తున్న పుల్లారెడ్డి కళాశాల యాజమాన్యం

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - జి.సిగడాం

మండల కేంద్రంలో ఎస్ఐ చామంతుల రామారావు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాలు ఉన్నాయో, లేదో సరి చూశారు. హెల్మెట్ లేకపోయినా, త్రిపుల్ రైడర్‌లో వచ్చిన వారిని అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - పోలాకి

ప్రతి ప్రభుత్వ పథకంలోనూ మహిళలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం బెలమర కూడలిలో ఎంపిపి ముద్దాడ దమయంతి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు పాదయాత్రలో గుర్తించిన ప్రజా సమస్యలను అధికారంలోకి రాగానే శతశాతం పరిష్కరించిన ముఖ్యమంత్రి జగనేనని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే తద్వారా సమాజంలో, వారి కుటుంబంలో గౌరవింపబడతారని చెప్పారు. తొలుత సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ. 9,73,79,906లు చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ధర్మాన కృష్ణదాస్, పద్మప్రియ, కరిమి రాజేశ్వరరావు, ఎం.భైరాగినాయుడు, కృష్ణారావు, చింతాడ మంజు, చింతు రాఘవరావు, కె.తాతారావు, కోట అప్పారావు, చింతాడ ఉమా, ఎంపిడిఒ ఈశ్వరరావు, తహశీల్దార్ శ్రీరాములు, ఎపిఎం రాజారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.



పోలాకి : చెక్కును అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్

జి.సిగడాం: మహిళలకు ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పిస్తోందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని 12,936 మంది మహిళలకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా రూ.8,92,69,392 చెక్కును ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. తొలుత వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.సత్యవతి, ఎం.వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, బి.వెంకటరమణ, వెంకటరావు, సన్యాసిరావు, ఈశ్వరమ్మ, తవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: సిఎం జగన్ రుణాన్ని మహిళలు తీర్చుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో వైఎస్ఆర్ ఆసరా 3వ విడత సంబరాలు నిర్వహించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ మహిళలకు అండగా సిఎం జగన్ ఉన్నారని అన్నారు. అనంతరం మహిళలకు ఆసరా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పిరియా సాయిరాజ్, శ్యాంప్రసాద్‌రెడ్డి, తడక యశోద, ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, డి.లోకేశ్వర్‌రెడ్డి, మడ్డు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మహిళలు తలెత్తుకుని తిరిగేలా అన్ని రంగాల్లోనూ అగ్రపీఠం వేస్తున్న ఘనత సిఎం జగన్‌దేనని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆసరా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.నాగేశ్వరరావు, జి.నాగభూషణరావు, సర్పంచ్ కె.సంజీవరావు, కవిటి రామరాజు, బి.గణపతిస్వామి, వెలుగు ఎసి శ్రీరాములు, ఎంపిడిఒ కె.నిశ్చల, తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా మహిళలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి 10,967 మందికి రూ.5,94,96,815ల ఆసరా చెక్కును పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా మహిళలు ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలుత సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, తహశీల్దార్ బాల, ఎంపిడిఒ పావని, జెడ్‌పిటిసి భాగ్యలక్ష్మి, ఎపిఎం త్రినాథమ్మ, సర్పంచులు పి.కృష్ణవేణి, రత్నాలు, ఎంపిటిసి రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: చెక్కును అందజేస్తున్న రెడ్డి శాంతి

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపిడిఒ లావణ్య

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్ఠికాహారం ఇవ్వడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎసిడిపిఒ లావణ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొలిగాం, కీర్తిపురం, పాయతారి, బొడ్డబొడ సచివాలయం పరిధిలో పోషణ పఖ్వాడా ఉత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధులు రమణ, రామచంద్ర పాడి, సూపర్ వైజర్ నీలవేణి, అంగన్వాడీలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పోలాకి: మండలంలోని రెహమాన్‌పురం పంచాయతీ బార్జిపాడు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పఖ్వాడా శుక్రవారం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త ప్రగడ జయలక్ష్మి వైద్య సిబ్బందితోపాటు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు . అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డ సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా తీసుకొని ఎన్నో జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి రాఘవేంద్ర, ఎఎన్ఎం సరస్వతి, రామకృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని చిట్టివలస గ్రామంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ జలుమూరు రవిబాబు ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ జెకె.నిఖిల్ మాట్లాడుతూ మళ్లీ కరోనా కేసులు నమోదు అవుతున్నాయని, అందువల్ల ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాస్కులను ప్రతి ఒక్కరూ పెట్టుకోవాలని, చేతులను శుభ్రపరుచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కోటి, చైతన్య, ప్రజలు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నిఖిల్

కొత్తమ్మతల్లి ఇఒగా రాధాకృష్ణ

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఆలయ ఇఒగా వాకచర్ల రాధాకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం ఉమారుద్ర కోటేశ్వర ఆలయ ఇఒగా పని చేశారు. ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఈఒగా ఉన్న సూర్యనారాయణ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణకు సిబ్బంది స్వాగతం పలికారు.

సచివాలయం సందర్శన

బూర్జ: జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ శుక్రవారం నాడు మండలంలోని అల్లిన గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నిర్వహణపై ఆరా తీశారు. ఆయనతోపాటు డిపిఆర్‌సి రీసోర్స్‌పర్సన్ పి.విజయలక్ష్మి, ఎంపిడిఒ ఎం.రవీంద్రబాబు, అల్లిన సర్పంచ్ జడ్డు దివ్య, పంచాయతీ కార్యదర్శి రాజారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి - కవిటి

స్థానిక రఘునాథస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. గొనప చంద్రశేఖర్ గాత్రానికి, బైరెడ్ల మాధవరావు వయోలిన్, గొనప చందనం మృదంగం తోడవడంతో కచేరి నభూతో నభవిష్యత్ అనేలా సాగింది.



కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - బూర్జ

ఎరువుల దుకాణదారులు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎఇ వి.రాజేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కురుంపేట, కొల్లివలస గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ-పాస్‌లో న మోదు చేసి, ఐఎఫ్ఎంసిలోని నిల్వలు, వాస్తవ ఎరువుల నిల్వలకు వ్యత్యాసం ఉండకూడదని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సుమారు 2500 మెట్రిక్ టన్నుల నత్రజని, భాస్వరం, పొటాష్ అవసరమని చెప్పారు. 50శాతం ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా, మిగతా 50శాతం కో-ఆపరేటివ్ సొసైటీ, ప్రైవేటు డీలర్స్ ద్వారా రైతులకు అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆయనతోపాటు వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న బృందావన్ దొలాయి

రేపు జిల్లాస్థాయి 'మేధా సమ్మాన్'

ప్రజాశక్తి - కవిటి

జిల్లాలో ఒడియా మాధ్యమం 5వ తరగతి పిల్లలకు ఎపి ఒడియా టీచర్స్ అసోసియేషన్(ఆపోటా) ఆధ్వర్యాన ఏప్రిల్ 2వ తేదీన జిల్లాస్థాయి మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలాయి తెలిపారు. సహలాలపుట్టుగలో బృందావన్ అధ్యక్షతన శుక్రవారం సన్నహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, టెక్కలి, మెళియాపుట్టి, పాతపాట్నం, భామిని మండలాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఒడియా విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఈ పరీక్షలు దోహదపడతాయని ఆయన అన్నారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు బేసి కృష్ణమూర్తి, హెచ్ఎం ప్రసన్నకుమార లిమ్మాయి, క్షమానంద చౌదురీ, మనోజ్ కుమార్, తులసీ ప్రధాన్, తదితరలు పాల్గొన్నారు.

1న పెన్షన్ డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్‌ను 1వ తేదీనే చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. సంఘ గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, ప్రధాన కార్యదర్శి బి.జనార్ధనరావు మాట్లాడుతూ పెన్షనర్లకు బకాయి పడిన డిఎను వెంటనే చెల్లించాలని, 11వ పిఆర్‌సి 21 నెలల, 12వ పిఆర్‌సి బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్.వి సత్యనారాయణ, డి.లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, పి.భానోజీరావు, కె.కోటేశ్వరరావు, సంజీవరావు, షణ్ముఖరావు, బెండి సూర్యనారాయణ, నారాయణరావు, ఎన్.సూర్యనారాయణ, బివి రమణ, పేడాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నర్సింహమూర్తి

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోషియేషన్ ఎన్నిక స్థానిక జూనియర్ కోర్డులో శుక్రవారం జరిగింది. అద్యక్షులుగా దుప్పల నరసింహామూర్తి, ఉపాధ్యాక్షులుగా బమ్మిడి నారాయణరావు, కార్యదర్శిగా వెలమల అప్పలనాయుడు, జాయింట్ సెక్రరేటరిగా వెంకటరావు, బమ్మిడి ధర్మారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

బంటుపల్లిలో అన్న సమారాధన

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లిలో శుక్రవారం శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు, సర్పంచ్ రజని దంపతులు సారథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానానికి భారీ ఎత్తున యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి.జగన్నాథరావు, మన్నె కృష్ణానందం, వెలిచేటి సురేష్‌కుమార్, రఘునాథ్, చింతపల్లి వెంకటరాజేష్, మన్నె నారాయణరావు, గోపిన కృష్ణారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



అన్న సమారాధన చేస్తున్న ఎన్ఇఆర్, రజని దంపతులు